

మహిళల అభ్యున్నతికి కృషి

మహిళల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తోందని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. 10లో▸



అనుమానాస్పద స్థితిలో..

అనుమానాస్పద స్థితిలో కాంట్రాక్ట్ కార్మికుడు మృతి చెందిన ఘటన కరన్‌కోట్ సీసీఐ పరిశ్రమలో చోటుచేసుకుంది. 10లో▸



ఘనంగా బోనాలు

దుద్యాల్ మండలం సంగాయిపల్లిలో ఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. 11లో▸

న్యూస్‌రీల్

దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలి



వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

అనంతగిరి: కేంద్ర ప్రభుత్వ తీరుకు నిరసనగా ఈ నెల 20న చేపట్టే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి మైపాల్ పిలుపునిచ్చారు. శనివారం వికారాబాద్‌లో ఆటో యూనియన్ల ఆధ్వర్యంలో సమ్మెకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని ఆరోపించారు. ఇప్పటికైనా కార్మిక వ్యతిరేక చట్టాలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్‌చేశారు. లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు.

రోడ్డు విస్తరణ పనులకు మార్కింగ్



రోడ్డు విస్తరణ కోసం కొలతలు తీస్తున్న మున్సిపల్ సిబ్బంది

కొడంగల్: పట్టణంలో రోడ్డు విస్తరణ పనులకు శనివారం ఆర్‌అండ్‌బీ అధికారులు, మున్సిపల్ సిబ్బంది మార్కింగ్ ఇచ్చారు. ఈ పనులకు రూ.45 కోట్లు మంజూరైనట్లు అధికారులు చెప్పారు. 4 కిలోమీటర్ల పొడవు, 100 అడుగుల వెడల్పుతో నాలుగు లేన్లుగా విస్తరించి డివైడర్లు ఏర్పాటు చేయనున్నారు. వినాయక చౌరస్తాను విస్తరించనున్నారు. పట్టణంలోని తాండూరు మహబూబ్‌నగర్ జాతీయ రోడ్డును విస్తరించి ట్రాఫిక్ సమస్యలు లేకుండా చేయనున్నారు. రోడ్డు విస్తరణ పనులకు ప్రజలు, దుకాణాదారులు సహకరించాలని అధికారులు కోరారు.

భాస్కరయోగికి పాత్రికేయ విశిష్ట పురస్కారం

పరిగి: ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త, కవి రచయిత డాక్టర్ భాస్కరయోగికి సమాచార భారతి.. నారద జయంతి సందర్భంగా కాలమిస్టుగా పాత్రికేయ విశిష్ట పురస్కారం అందజేసింది. నగరంలోకి కోఠిలో వైఎంఐఎస్‌లో పురస్కారం అందుకున్నారు. కార్యక్రమంలో మాజీ ఐఏఎస్ అధికారులు చామర్తి ఉమామహేశ్వరరావు, సాయి ప్రసాద్, సమాచార భారతి అధ్యక్షుడు ప్రొఫెసర్ గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

వాహనాలకు నంబర్ ప్లేట్లు తప్పనిసరి

తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి



నంబర్ ప్లేట్లు లేని వాహనాలను సీజ్ చేసిన పోలీసులతో డీఎస్పీ బాలకృష్ణారెడ్డి

యాలాల: వాహనాలకు నంబర్ ప్లేట్లు తప్పనిసరిగా ఉండాలని, లేకుంటే చర్యలు తప్పవని తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి హెచ్చరించారు. శనివారం మండలంలోని లక్ష్మీనారాయణపూర్ చౌరస్తాలో యాలాల ఎస్‌ఐ గిరి ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాహనాలకు నంబర్ ప్లేట్లు, ట్రిపుల్ రైడింగ్, డ్రంకెన్ డ్రైవ్‌పై అవగాహన కల్పించారు. డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడితే జరిమానాతో పాటు జైలు శిక్ష తప్పదని హెచ్చరించారు. ట్రాఫిక్ రూల్స్‌కు లోబడి వాహనాలు నడపాలని సూచించారు. కార్యక్రమంలో పీఎస్‌ఐ వినోద్ పాల్గొన్నారు.

వీర సైనికులకు ఘన నివాళి



కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న కాలనీవాసులు

అనంతగిరి: పాక్ దాడుల్లో మృతి చెందిన వీర సైనికులకు శనివారం వికారాబాద్‌లోని కొత్త గంజ్ హనుమాన్ మందిరం వద్ద కాలనీవాసులు ఘనంగా నివాళులర్పించారు. ఆలయంలో హనుమాన్ చాలీసా పారాయణం అనంతరం కొవ్వొత్తుల ప్రదర్శన చేపట్టారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ చిగుళ్లపల్లి రమేష్‌కుమార్ పాల్గొన్నారు.

అమ్మా వందనం

బిడ్డల ఉన్నతే లక్ష్యంగా నిలిచి, గెలిచిన మాతృమూర్తులు

- ఎన్ని అవాంతరాలు ఎదురైనా మొక్కవోని ధైర్యంతో ముందుకు..
- పిల్లల విజయాలతో పట్టలేని సంతోషం
- నేడు మదర్స్ డే



సాక్షి ప్రత్యేకం

సృష్టిలో తియ్యనైన పదం 'అమ్మ'.. సృష్టికి మూలం కూడా అమ్మే.. అమ్మా అనే రెండక్షరాల్లోని ప్రేమను కొలిచేందుకు సరితూగే సాధనాలే లేవు. కరుణ, త్యాగానికి ప్రతిరూపమైన అమ్మ గొప్పతనం.. ఆ పిలుపులోని మాధుర్యం వెలకట్టలేనిది. ఆమె జీవితంలో ఎన్ని కష్టనష్టాలు ఎదురైనా.. తన బిడ్డలను ఉన్నత స్థితిలో నిలిపేందుకు అమ్మ పడే వేదన మాటలకందనిది. అందుకే అమ్మా.. అందుకో మా వందనం.



దేవుడు పంపిన 'అమ్మ'



కూతురు, మనవరాళ్లతో విజయలక్ష్మి

మీర్‌పేట: వివాహమైన కొన్నేళ్లకు కూడా పిల్లలు కాకపోవడంతో అనాథ పాపను దత్తత తీసుకుంది. చిన్నారికి అనారోగ్య సమస్య ఉందని తెలిసినా, భర్త సహకారంతో పాపను పెంచి పెద్ద చేసింది. అమ్మా అనే పిలుపు కోసం ఆతల్లి పడిన వేదన మాతృత్వంలోని మమకారాన్ని చాటిచెప్పింది. తన బిడ్డకు విద్యాబుద్ధులు నేర్పించి, సొంతకాళ్లపై నిలబడేందుకు ఎంతో కృషి చేసింది. అనంతరం ఆమెకు వివాహం చేయడంతో పాటు పుట్టిన ఇద్దరు మనవరాళ్ల ఆలనాపాలనా చూసుకుంటోంది. ఆమే నందిహిల్స్‌కు చెందిన విజయలక్ష్మి. వివాహమైన కొన్నేళ్లు గడిచినా పిల్లలను పుట్టకపోవడంతో ఎవరినైనా దత్తత తీసుకోవాలని నిర్ణయించుకుంది. తనకు ఆడపిల్లనే కావాలని కోరింది. స్టేట్ హోమ్ నుంచి ఓ పాపను దత్తత తీసుకుంది. ఇంటికి తెచ్చుకున్న తర్వాత చిన్నారి ఆరోగ్య పరిస్థితి బాగో లేకపోవడంతో ఏళ్ల తరబడి ఎంతో కష్టపడి ఆస్పత్రుల చుట్టూ తిప్పింది. బిడ్డను కంటికి రెప్పలా కాపాడుకుంది. ఈ క్రమంలో ఎన్ని ఇబ్బందులు ఎదురైనా ధైర్యంగా నిలబడింది. భర్త యాదయ్య సహకారంతో తన కూతురుకు విద్యాబుద్ధులు నేర్పించి, నచ్చిన రంగంలో ఆమెను ప్రోత్సహించింది. అనంతరం తగిన వరున్ని చూసి వివాహం చేసింది. అల్లుడు, కూతురిని తన వద్దే పెట్టుకుంది. ప్రస్తుతం విజయలక్ష్మి బిడ్డకు ఇద్దరు ఆడ పిల్లలు సంతానం. వీరిని కూడా ఆమే చూసుకుంటూ ఆదర్శంగా నిలుస్తోంది.

అమ్మ కష్టం వృథా కాలే..



ప్రభుత్వ ఉపాధ్యాయుడైన పెద్ద కొడుకు సత్యనారాయణతో పోచమ్మ

పరిగి: భర్త మృతితో కుంగిపోకుండా పిల్లల ఎదుగుదలే ధ్యేయంగా కష్టపడింది. కూలీ పనులు చేసుకుంటూ ఇద్దరు కుమారులను చదివించింది. అమ్మ కష్టాన్ని గుర్తించిన ఆ బిడ్డలు బుద్ధిగా చదువుకున్నారు. ప్రస్తుతం ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఊటుపల్లి గ్రామానికి చెందిన కావలి పోచమ్మ, అనంతయ్య దంపతులకు ఇద్దరు కుమారులు. పిల్లలు చిన్న వయసులో ఉండగానే అనారోగ్యం బారిన పడి అనంతయ్య మృతిచెందాడు. సెంటు భూమి కూడా లేని నిరుపేద కుటుంబం వీరిది. ఇంటి పెద్ద దిక్కు కూలిపోవడంతో ఆతల్లి రెక్కలు విరిగినట్లయింది. తిండికి కూడా లేని పరిస్థితిలో అనేక సమస్యలు చుట్టుముట్టాయి. వీటన్నింటినీ ఎదుర్కొని, పిల్లల కోసమే పరితపించింది. ఎన్ని అవాంతరాలు ఎదురైనా వారి చదువును ముందుకు నడిపింది. ప్రస్తుతం పెద్ద కుమారుడు సత్యనారాయణ ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా, చిన్న కొడుకు రాఘవేందర్ కానిస్టేబుల్‌గా ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తున్నారు. మాతృ దినోత్సవం సందర్భంగా పోచమ్మను పలకరించగా.. నేను పడ్డ కష్టానికి తగ్గట్లుగా పిల్లలు వృద్ధిలోకి రావడం సంతోషాన్నిస్తోందని భావోద్వేగం వ్యక్తంచేసింది.

అమ్మే.. నాన్నలా..

ఇబ్రహీంపట్నం: భర్త, ఇద్దరు పిల్లలతో సంతోషంగా సాగిపోతున్న ఆమె జీవితంలో ఊహించని పిడుగుపడింది. విధి వక్రీకరించి భర్త మరణించడంతో దిక్కులేని స్థితిలో బతుకు భారంగా మారింది. అయినా పిల్లలను పోషించుకునేందుకు లాండ్రీ షాపు నిర్వహిస్తూ అద్దె ఇంట్లో కాలం వెళ్లదీస్తోంది. పట్టణంలోని గోల్కొండ శ్రీలతకు బీఎస్‌రెడ్డిలోని ఓ ప్రైవేట్ విద్యాసంస్థలో వ్యాన్ డ్రైవర్‌గా పనిచేసే రాజుతో 2007లో వివాహం జరిగింది. వీరికి వైష్ణవి, సాయికార్తీక్ సంతానం. పెళ్లయిన నాలుగేళ్లకే రాజు మరణించాడు. అత్తవారి ఇంటి వదద్ద ఆస్తిపాస్తులు కూడా లేకపోవడంతో ఇద్దరు పిల్లలను తీసుకుని పుట్టింటికి వచ్చేసింది. తన పిల్లలను అనాథలుగా మార్చేందుకు ఇష్టం లేక.. కష్టాన్ని దిగమింగుకుని తన కాళ్లపై నిలబడాలని నిర్ణయించుకుంది. స్థానికంగా లాండ్రీషాపు ప్రారంభించి ఇద్దరు పిల్లను చదివిస్తోంది.



ఇబ్రహీంపట్నంలోని తన లాండ్రీషాపులో ఇస్త్రీ చేస్తున్న శ్రీలత

ఆతల్లి పిల్లలు అందరూ ప్రభుత్వ ఉద్యోగులే



కొడుకులు, కూతుళ్లతో ఎర్రోళ్ల అంజిలమ్మ

బొంరాస్‌పేట: మండల పరిధిలోని గౌరారానికి చెందిన ఎర్రోళ్ల రాములు, అంజిలమ్మకు ఆనందం, సురేఖ, రాజేందర్, విజయ్, వసంత ఐదుగురు సంతానం. వ్యవసాయ కూలీలుగా పనిచేసే భార్యాభర్తలు పిల్లలతో కలిసి హాయిగా జీవిస్తున్నారు. పిల్లలు ప్రాథమిక విద్యలో ఉండగానే తండ్రి అకాలమరణం చెందాడు. దీంతో అన్ని బాధ్యతలు అంజిలమ్మపై పడ్డాయి. భర్తను కోల్పోయిన బాధ వేధిస్తున్నా.. తన పిల్లలను బతికించుకోవడమే ధ్యేయంగా సాగింది. కూలీ పనులు చేస్తూనే వారిని బడికి పంపింది. పిల్లలను బాగా చదివించింది. కట్ చేస్తే.. పెద్ద కొడుకు ఆనందం పంచాయతీ కార్యదర్శిగా, సురేఖ ప్రభుత్వ ఉపాధ్యాయినిగా(ఎస్‌ఏ ఇంగ్లిష్), రెండో కొడుకు రాజేందర్ విద్యుత్ శాఖలో ఉద్యోగిగా, చిన్న కొడుకు విజయ్ ఎస్‌ఐగా, చిన్నకూతురు వసంత ఎస్‌ఐగా ప్రభుత్వ ఉద్యోగాల్లో స్థిరపడ్డారు.

కలలు నిజమయ్యాయి



నాభర్త 2010లో చనిపోయాడు. 15 ఏళ్ల నుంచి నా కొడుకులు, కూతుళ్లకు తండ్రిలేడనే లోటు లేకుండా పెంచా. ఆయన ఆలోచన ప్రకారం అందరు బాగా చదవాలని కోరుకున్నా. అలాగే చదివించాను. అందరికీ సర్కారు కొలువులు రావడం చాలా ఆనందంగా ఉంది.

– ఎర్రోళ్ల అంజిలమ్మ, గౌరారం



కొడుకు ఎస్‌ఐ విజయ్‌తో తల్లి అంజిలమ్మ

ఆరుగురు కూతుళ్ల 'ఆరోగ్య' లక్ష్మి



ఆరుగురు అక్కాచెల్లెల్లు, (ఇన్‌సెట్‌లో) తల్లి లక్ష్మి



కొడంగల్: ఆరుగురు ఆడ పిల్లలు ఉన్నారని ఆ తల్లి ఏనాడూ చిన్నబుచ్చుకోలేదు. కొడుకులైనా, బిడ్డలైనా ప్రయోజకులైతే చాలని భావించింది. అందరినీ బాగా చదివించింది. ప్రస్తుతం వీరందరూ వైద్యారోగ్య శాఖలో విధులు నిర్వర్తిస్తున్నారు. రావులపల్లికి చెందిన లక్ష్మి, అంజయ్యగౌడ్ గీత కార్మికులు. కులవృత్తే వీరి జీవనాధారం. ఆడ పిల్లలకు చదువెందుకు అనుకోకుండా రెక్కల కష్టంతో బిడ్డలను చదివించారు. మొదటి కూతురు జయమాల, రెండో కూతురు అనురాధ అంగడిరాయ్‌చూర్ పీహెచ్‌సీలో ఏఎన్‌ఎంలుగా, మూడో కూతురు అరుణజ్యోతి జీఎన్‌ఎమ్‌గా, నాలుగో కూతురు ఉమలత ఎమ్‌ఎన్‌జే క్యాన్సర్ ఆస్పత్రిలో స్టాఫ్ నర్స్‌గా, ఐదో కూతురు రాధిక తాండూరు ప్రభుత్వ ఆస్పత్రిలో బీఎస్సీ నర్సింగ్, ఆరో కూతురు శిరీష జీఎన్‌ఎమ్ స్టాఫ్ నర్స్‌గా పనిచేస్తున్నారు. నలుగురు పెద్ద కూతుళ్లకు వివాహం చేశారు.

ముగ్గురు ఉపాధ్యాయుల తల్లి



కొడుకులు, కూతురుతో నూర్జహాన్‌బేగం

అనంతగిరి: బషీరాబాద్ మండలం పర్వత్‌పల్లికి చెందిన మహబూబ్, నూర్జహాన్‌కు దంపతులకు నస్రీన్‌బేగం, యాసిన్, మోసిన్ ముగ్గురు సంతానం. ప్రభుత్వ పాఠశాలలో నైట్ వాచ్‌మన్‌గా పనిచేసే మహబూబ్ 1987లో జరిగిన రైలు ప్రమాదంలో అకాల మరణం చెందారు. అప్పటికీ పిల్లల వయసు ఏడేళ్లలోపే. భర్త మృతితో కారుణ్య నియామకం కింద నూర్జహాన్‌కు మైల్వార్ ప్రభుత్వ పాఠశాలలో (1988) అటెండర్‌గా ఉద్యోగం ఇచ్చారు. ఎన్ని కష్టాలు ఎదురైనా తన పిల్లలను ప్రయోజకులను చేయాలనే ఏకైక లక్ష్యంతో ముందుకు సాగింది. అనేక కష్టాల మధ్య తల్లిని అనుసరిస్తూ పెరిగిన పిల్లలు కష్టపడి చదివారు. ముగ్గురూ ప్రభుత్వ ఉపాధ్యాయులుగా ఉద్యోగాలు సాధించారు. పెద్దమ్మాయి నస్రీన్‌బేగం ప్రస్తుతం బోయిన్‌పల్లి ప్రభుత్వ పాఠశాలలో, ఉపాధ్యాయుడైన యాసిన్ ఎస్‌సీఆర్‌టీలో ఫ్యాకల్టీగా, మోసిన్ మర్పల్లి మండలం పిల్లగుండ్ల ప్రాథమికోన్నత పాఠశాలలో హెచ్‌ఎంగా విధులు నిర్వర్తిస్తున్నారు. శివారెడ్డిపేట ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తూ 2020లో నూర్జహాన్ విరమణ పొందారు. ప్రస్తుతం వికారాబాద్‌లో స్థిరనివాసం ఏర్పరచుకున్నారు.

ఆయన ఆకాంక్ష నెరవేరింది

పిల్లలను బాగా చదివించి, టీచర్లుగా చేయాలనేది నా భర్త ఆకాంక్ష. ఆయన అప్పటికే కవి, రచయిత. ఆయన ఆశయం మేరకు పిల్లలను చదివించా. నా ముగ్గురు పిల్లలు ప్రభుత్వ ఉద్యోగులుగా సమాజంలో మంచి పేరు తెచ్చుకున్నారు. ఒక తల్లిగా ఇంతకన్నా సంతోషం ఏముంటుంది.

– నూర్జహాన్‌బేగం, రిటైర్డ్, అటెండర్



'మాతృ'భూమికి ఇద్దరు సైనికులు



కొడుకులతో తల్లి ఎల్లమ్మ

దుద్యాల్: మండల పరిధిలోని హస్నాబాద్‌కు చెందిన గొల్ల ఎల్లమ్మ, అనంతయ్య దంపతులకు రాములు, మల్లేశ్, సంతోష్ ముగ్గురు సంతానం. అనంతయ్య అకాల మృతితో పిల్లల భారం ఎల్లమ్మపై పడింది. తన బాధను గుండెల్లోనే దాచుకుని ముగ్గురు కొడుకులను చదివించింది. పెద్ద కుమారుడు రాములు సైన్యంలో సేవలందించి, పదవీ విరమణ పొందారు. ప్రస్తుతం బ్యాంకులో గార్డుగా ఉద్యోగం చేస్తున్నారు. 2016లో ఇండియన్ ఆర్మీలో చేరిన రెండో కొడుకు మల్లేశం సైనికుడిగా దేశరక్షణ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. చిన్నకొడుకు మల్లేశం ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. దేశానికి ఇద్దరు సైనికులను అందించిన ఎల్లమ్మకు మదర్స్ డే సెల్యూట్.

అమ్మ ప్రోత్సాహమే గెలిపించింది



షాద్‌నగర్ రూరల్: మహేశ్వరం మండలం పెద్దమ్మతండాకు చెందిన మంగ్యానాయక్, మోతీ దంపతులకు జ్యోతి, సుశీల, రుక్మిణి, అరుణ నలుగురు ఆడపిల్లలు. నిరుపేద గిరిజన కుటుంబానికి చెందిన వీరికి వ్యవసాయమే ప్రధాన ఆధారం. తండాలో పుట్టిన తన పిల్లలకు ఉజ్వల భవిష్యత్తు ఇవ్వాలని మోతీ నిర్ణయించుకుంది. తామెన్ని ఇబ్బందుల్లో ఉన్నా బిడ్డల చదువుల విషయంలో ఏనాడూ వెనకడుగు వేయలేదు. ఈక్రమంలో జ్యోతి ఎక్సైజ్ కానిస్టేబుల్‌గా, సుశీల ఎస్‌ఐగా, రుక్మిణి టీచర్‌గా ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు. 2020 బ్యాచ్‌కు చెందిన సుశీల ప్రస్తుతం వికారాబాద్ జిల్లా కరన్‌కోట్ పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

హ్యాపీ మదర్స్ డే

అందరి జీవితంలోనూ అమూల్యమైన వ్యక్తి అమ్మ. బిడ్డల కోసం ఆమె పడే ఆరాటం అంతాఇంతా కాదు. మా అమ్మానాన్నలకు మేం నలుగురం ఆడపిల్లలమే. అమ్మ ప్రోత్సాహమే నన్ను నిలబెట్టింది. ప్రస్తుతం నాకు కూడా ఓ కూతురు (మైరా) ఉంది. అమ్మలందరికీ మదర్స్ డే శుభాకాంక్షలు.

– సుశీల ఎస్‌ఐ, షాద్‌నగర్.





భర్త వినేష్, కూతురు మైరాతో ఎస్‌ఐ సుశీల

క్లుప్తంగా

హకీంపేట్‌లో సీసీ కెమెరాల ఏర్పాటు



దుద్యాల్: మండలంలోని హకీంపేట్ ప్రధాన కూడలిలో నాలుగు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు ఎస్‌ఐ యాదగిరి తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. హకీంపేట్‌లో సీసీ కెమెరాలు లేకపోవడంతో వాటిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

విద్యుదా ఘాతంతో చెరుకు పంట దగ్ధం



విద్యుత్ వైర్లను చూపిస్తున్న రైతు జితేందర్‌రెడ్డి

తాండూరు రూరల్: విద్యుదా ఘాతంతో చెరుకు పంట దగ్ధమైంది. ఈ సంఘటన పెద్దేముల్ గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. పెద్దేముల్ గ్రామానికి చెందిన రైతు జితేందర్‌రెడ్డి చెరుకు పంట సాగు చేశాడు. శనివారం మధ్యాహ్నం పొలంలో ఏర్పాటు చేసిన విద్యుత్ వైర్లు ఒకదానికొకటి రాసుకొని మంటలు చెలరేగి చెరకుపంట దగ్ధమైంది. ఈ విషయాన్ని స్థానిక రైతులు గుర్తించి జితేందర్‌రెడ్డికి సమాచారం చేరవేశారు. ఆ తర్వాత అందరూ కలిసి మంటలను ఆర్పేశారు. అయితే పొలంలో విద్యుత్‌తీగలు వేలాడుతున్న క్రమంలో ఒక్కసారిగా మంటలు ఏర్పడ్డాయన్నారు. వేలాడుతున్నా విద్యుత్‌వైర్లకు మరమ్మతులు చేయాలని గతంలో విద్యుత్ అధికారులను పలుమార్లు కోరినా పట్టించుకోవడం లేదని రైతు ఆవేదన వ్యక్తం చేశారు. చెరుకు పంటతో పాటు బోరు మోటారు, స్టాటర్, విద్యుత్‌వైర్లు పూర్తిగా కాలిపోయాయని ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ సంఘటనలో సుమారు రూ.2 లక్షల వరకు ఆస్తి నష్టం వాటిల్లిందని రైతు పేర్కొన్నాడు.

చేపలు పట్టడానికి వెళ్లి..

గండిపేట చెరువులో మునిగి వ్యక్తి మృతి

మొయినాబాద్: చెరువులో చేపలు పట్టడానికి వెళ్లిన వ్యక్తి ప్రమాదవశాత్తు నీట మునిగి చనిపోయాడు. ఈ సంఘటన మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధి చిలుకూరులో ఆదివారం వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చిలుకూరుకు చెందిన తోల్కట్ట శ్రీశైలం (28) బాలాజీ దేవాలయం వద్ద కొబ్బరికాయలు విక్రయించడంతో పాటు చెరువులో చేపలు పడుతూ కుటుంబాన్ని పోషించేవాడు. కాగా ఈ నెల 8న శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు గ్రామ సమీపంలోని గండిపేట చెరువు లో చేపలు పట్టేందుకు వెళ్లాడు. చెరువులో చేపల కోసం వల వేస్తుండగా అది అ తని కాళ్లకు చుట్టుకొని నీటిలో మునిగిపోయా డు. రాత్రి అయినా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పరిసర ప్రాంతాల్లో వెతికా రు. కాగా ఆదివారం ఉదయం అతడి మృతదే హం చెరువులో తేలడాన్ని గమనించిన స్థానికు లు కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని బయటకు తీశారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బహుదూరపు బాటసారి..

- పాలమూరు గొర్రెల కాపరులు
- నెలలతరబడి ఇంటికి దూరం
- కులవృత్తిని నమ్ముకుని జీవనం
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న కాపరులు
- ప్రభుత్వం ఆదుకోవాలి



రోడ్డు పక్కన మేత మేస్తున్న గొర్రెలు

బంట్వారం: పాలమూరు గొర్రెల కాపరులను బహుదూరపు బాటసారులుగా పిలుస్తున్నారు. ఏడాదిలో 8 నెలల పాటు కురుమ, గొల్లలు వివిధ జిల్లాల్లో గొర్రెల మందలతో మేత మేపడం కోసం తిరుగుతూనే ఉంటారు. బంట్వారం, కోట్‌పల్లి మండలాల్లో సైతం వస్తుంటారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన గొర్రెల కాపరులు బృందాలుగా ఏర్పడి మందలతో బయలు దేరుతారు. ప్రతీఏటా దీపావళి తర్వాత ఇళ్లను వదిలి జీవాలతో సంచరిస్తుంటారు. పాలమూరు జిల్లా ఒకప్పుడు కరువు కాటకాలతో కొట్టుమిట్టాడుతుండేది. మూగజీవాలను బతికించుకునేందుకు అక్కడి గొర్రెల కాపారులు నానాతంటాలు పడేవారు. ఈ క్రమంలోనే వారు అప్పట్లోనే గొర్రెల మందలతో మేత కోసం సుదూర ప్రయాణం చేస్తుంటారు. నేటికి కూడా అదే పద్ధతిని అనుసరిస్తున్నారు. వేలాది గొర్రెలతో రోడ్డు మార్గంలో వందల కిలోమీటర్లు కాలినడకన సంచరిస్తుంటారు. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా కుల వృత్తిని మాత్రం వదిలి పెట్టమని గర్వంగా చెబుతున్నారు.

తరచూ ప్రమాదాలు

సుదూర ప్రయాణం రోడ్డు మార్గంలో కూడా సాగడంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని చెబుతున్నారు. వాహనాలు ఢీకొని జీవాలు చనిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇన్సూరెన్స్ లేకపోవడంతో తాము నష్టపోతున్నామని చెబుతున్నారు. సంబంధిత పశు సంవర్ధక శాఖ అధికారులు జీవాలకు ఇన్సూరెన్స్ చేయించడం లేదు. అవగాహన కల్పించడం లేదు.

ఎక్కడ చీకటి పడితే అక్కడే..

నెలల తరబడి ఇంటికి దూరంగా ఉంటున్నారు. వందలాది కిలో మీటర్లు తిరుగుతూ ఎక్కడ చీకటి పడితే అక్కడే పొలాల్లో నిద్రిస్తున్నారు. సరైన భోజనం, నీటి వసతి లేక ఇబ్బందులు పడుతున్నారు. జీవాలకు సైతం తాగునీరు కరువైంది. వాగులు, వంకలు అందుబాటులో ఉంటేనే నీరు తాగిస్తున్నారు. జూన్‌లో వచ్చే మృగశిర కార్తె వరకు బయటనే కాలం గడుపుతారు. వర్షాలు మొదలవ్వగానే మెల్లగా మందలతో పాలమూరుకు తిరు పయనమవుతారు.

పొలాల్లో మందలు వేస్తూ..

రాత్రి వేళ పొలాల్లో మందలు వేస్తే రైతులు వెయ్యి రూపాయలు ఇస్తున్నారు. బియ్యం ఇతర నిత్యావసర సరుకులు అందజేస్తున్నారు. వీటితోనే కాపారులు కాలం గడుపుతున్నారు. పొలాల్లోనే వంట చేసుకుంటున్నారు. తెల్లవారగానే భోజనం సిద్ధం చేసుకుని సద్దిమూట, నీటి డబ్బాలతో మళ్లీ గొర్రెల మందతో ముందుకు సాగుతున్నారు. గొర్రెల ఎరువు పొలాలకు చాలా బలం కావడంతో రైతులు పోటీ పడి రాత్రి వేళ మందలు వేసుకుంటున్నారు.

మందకు నలుగురు..



ఇదే వృత్తిని నమ్ముకుని జీవిస్తున్నాం. 8 నెలల పాటు బయటి ప్రపంచానికి దూరంగా ఉంటాం. రెండు నెలలకు ఒక సారి ఇంటికి వెళ్లి వస్తాం. ఒక్కో మందకు నలుగురు కాపలాగా ఉంటారు. మెదక్, కరీంనగర్ ప్రాంతాల్లో కూడా తిరుగుతాం. వర్షాకాలం వరకు బయటనే ఉంటాం. గొర్రెల కాపరులను ప్రభుత్వం పట్టించుకోవాలి. – ఆనందం, గొర్రెల కాపరి

ఇన్సూరెన్స్ లేక నష్టం



ఇన్సూరెన్స్ లేకపోవడంతో నష్టపోతున్నాం. రోడ్డు పొడువునా చాలా దూరం వెళ్తుంటాం. కొన్ని సార్లు లారీలు, ఇతర వాహనాలు గొర్రెల మందను గుద్దేసి పోతాయి. ఎవరూ పట్టించుకోరు. చాలా ఇబ్బందులు పడుతున్నాం. కులవృత్తి కావడంతో వదిలిపెట్టడం లేదు. చాలా కాలంగా ఇదే వృత్తిని నమ్ముకని బతుకుతున్నాం. అప్పడప్పుడు ఇంటికి వెళ్లి వస్తుంటాం. జూన్ వరకు గొర్రెల మందలతో ఉంటాం. ప్రభుత్వం గొర్రెల కాపారులను ఆదుకోవాలి. – ఐలయ్య, గొర్రెల కాపరి

మహిళల అభ్యున్నతికి కృషి

ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి



మహిళలకు కుట్టుమిషన్లు, సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే టీఆర్‌ఆర్

పరిగి: మహిళల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే టీ రామ్మోహన్‌రెడ్డి అన్నారు. ఎస్సీ కార్పొరేషన్ సహకారంతో కుట్టు శిక్షణ పూర్తి చేసుకున్న 70 మంది మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్లు, సర్టిఫికెట్లను శనివారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక మహిళల రాజ్యం నడుస్తోందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, వారి పేరిటే ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసినట్లు వివరించారు. కాంగ్రెస్ అంటేనే పేదల ప్రభుత్వమని పేర్కొన్నారు. ప్రస్తుత ఆధునిక సమాజంలో ఫ్యాషన్ డిజైనింగ్ రంగంలో విరివిగా ఉపాధి అవకాశాలు ఉన్నట్లు తెలిపారు. కుట్టు శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలు ఆ దిశగా ఆలోచన చేసి వృద్ధి సాధించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ బాబుమోసెస్, పరిగి, కుల్కచర్ల మార్కెట్ కమిటీల చైర్మన్లు పరశురాంరెడ్డి, ఆంజనేయులు ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

సైనికుల కుటుంబాలకు అండగా ఉంటాం

పాకిస్తాన్‌పై జరిగిన యుద్ధంలో అమరులైన వీర సైనికుల కుటుంబాలకు అండగా ఉంటామని ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. యుద్ధంలో వీర మరణం పొందిన సైనికుడు మురళీనాయక్‌కు నివాళులర్పించారు. ఆయన సేవలను దేశం ఎప్పటికీ మరచిపోదని పేర్కొన్నారు.

వాహనం ఢీకొని మహిళ దుర్మరణం

రాజేంద్రనగర్: రోడ్డు దాటుతున్న ఓ మహిళను తుఫాన్ వాహనం వేగంగా ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ క్యాస్ట్రో సమాచారం మేరకు..మైలార్‌దేవ్‌పల్లి బాబుల్‌రెడ్డినగర్‌కు చెందిన జయమ్మ (35) పని నిమిత్తం శనివారం ఉదయం ఆరాంఘర్ చౌరస్తా వద్దకు వచ్చింది. రోడ్డు దాటుతుండగా శంషాబాద్ నుండి ఆరాంఘర్ మీదుగా వేగంగా వెళుతున్న తుఫాన్ వాహనం ఢీకొట్టింది. ఈ సంఘటనలో తీవ్ర గాయాలకు గురైన జయమ్మ అక్కడికక్కడే మృతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న రాజేంద్రనగర్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించి మృతదేహన్ని ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఇన్‌స్పెక్టర్ వివరించారు.



భగవద్గీతపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న రాములు, మల్లేశం

శ్లోకాల పఠనంతో జ్ఞానసముపార్జన

భగవద్గీత అధ్యాపకుడు రాములు, మండల మాజీ ఉపాధ్యక్షుడు మల్లేశం

దోమ: భగవద్గీత శ్లోకాలను కంఠస్తం చేయడంతో జ్ఞాపక శక్తి పెరుగుతుందని భగవద్గీత అధ్యాపకుడు రాములు, మండల మాజీ ఉపాధ్యక్షుడు జి.మల్లేశం అన్నారు. మండలంలోని మోత్కూర్ గ్రామంలో ఏడాదిగా విద్యార్థులకు భగవద్గీత అభ్యాస కార్యక్రమం నిర్వహిస్తున్నారు. 12వ అధ్యాయం పూర్తయిన సందర్భంగా శనివారం విద్యార్థులకు శ్లోకాల పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ భగవద్గీత పఠనం చేయాలని సూచించారు. అందులోని శ్లోకాలు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. కార్యక్రమంలో తెలుగు ఉపాధ్యాయుడు పాలేపల్లి వెంకటయ్య, మాజీ ఉపసర్పంచ్ కరణం శ్రీకాంత్ రావు, విద్యార్థులు, గ్రామస్తులు, పాల్గొన్నారు.

కారులో మంటలు.. ఇద్దరు సజీవ దహనం

- ఆస్పత్రికి తరలిస్తుండగా మరొకరి మృతి
- ఓఆర్‌ఆర్‌పై ఆగిఉన్న బొలేరోను ఢీకొట్టడంతో ప్రమాదం



యువకుల మృతదేహాలను వెలికి తీస్తున్న పోలీసులు

అబ్దుల్లాపూర్‌మెట్: ఔటర్ రింగ్ రోడ్డుపై శనివారం తెల్లవారు జామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. రహదారిపై నిలిపి ఉన్న బొలేరో వాహనాన్ని వెనుక నుంచి వచ్చిన కారు బలంగా ఢీకొట్టడంతో కారులో మంటలు చెలరేగాయి. అందులో ప్రయాణిస్తున్న ముగ్గురు యువకులు మంటల్లో చిక్కుకుని మృత్యువాత పడ్డారు. అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. నగరంలోని తాడ్బన్ బహదూర్‌పూర ప్రాంతం హెచ్‌బీ కాలనీలో నివాసముండే రితేష్‌కుమార్ కుమారుడు దీపేష్‌కుమార్ (23) శుక్రవారం రాత్రి 11గంటలకు స్నేహితులను కలిసేందుకు వెళ్తున్నానని చెప్పి తన కారులో ఇంటి నుంచి బయలుదేరాడు. ఈ క్రమంలో తన స్నేహితులైన హైదరాబాద్ వీటీసీ కాలనీకి చెందిన సంచయ్ మల్పనీ (22), మూసాపేట్‌కు చెందిన ప్రియాన్ష్ మితల్ (23) కలిసి శంషాబాద్ వైపు వెళ్తున్నారు. పెద్దఅంబర్‌పేట శివారు గండిచెరువు వంతెన సమీపంలోకి రాగానే (రాత్రి 2 గంటలకు) ఎలాంటి సూచిక బోర్డులు ఏర్పాట చేయకుండా రోడ్డుపై నిలిపి ఉంచిన బొలేరోను ఢీకొట్టారు. వీరి కారు బొలేరో ముందు భాగంలో ఇరుక్కుని, ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. యువకులు తేరుకునే లోపే ఉవ్వెత్తున ఎగిసిపడ్డాయి. ఈ ఘటనలో దీపేష్ కుమార్, సంచయ్ మల్పనీ కారులోనే సజీవ దహనం కాగా, కొన ఊపిరితో ఉన్న ప్రియాన్ష్‌మితల్‌ను అతికష్టంగా బయటకు తీసిన స్థానికులు ఎల్‌బీనగర్‌లోని కామినేని ఆస్పత్రికి తరలించారు. అప్పటికే అతను మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను ఉస్మానియా మార్చురీకి తరలించారు.

అనుమానాస్పద స్థితిలో కాంట్రాక్ట్ కార్మికుడి మృతి

- కరన్‌కోట్‌లోని సీసీఐ ఫ్యాక్టరీలో ఘటన
- బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని ఆందోళన
- మద్దతుగా నిలిచిన కార్మికులు, గ్రామ నాయకులు
- ఆదుకుంటామని యాజమాన్యం హామీ



ఆందోళనకారులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ విఠల్‌రెడ్డి



సీసీఐ ఫ్యాక్టరీలో ఉస్సేన్ అలీ మృతదేహం

తాండూరు రూరల్: అనుమానాస్పద స్థితిలో ఓ కాంట్రాక్ట్ కార్మికుడు మృతి చెందాడు. ఈ ఘటన కరన్‌కోట్ గ్రామ శివారులోని సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ)లో శనివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. ఎస్‌ఐ విఠల్‌రెడ్డి, బాధిత కుటుంబ సభ్యుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కరన్‌కోట్ గ్రామానికి చెందిన ఉస్సేన్ అలీ(39)కి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. సీసీఐ ఫ్యాక్టరీలో పంప్‌హౌస్‌లో కాంట్రాక్ట్ కార్మికుడిగా 15 సంవత్సరాలుగా పని చేస్తున్నాడు. ఎప్పటిలాగే శుక్రవారం రాత్రి విధులకు వెళ్లాడు. శనివారం తెల్లవారుజామున పని ప్రదేశంలో ఒక్కసారిగా కుప్పకూలి పోయాడు. అక్కడే పని చేస్తున్న ఉస్సేన్ అలీ సోదరుడు మహబూబ్ అలీకి తోటి కార్మికులు సమాచారం ఇచ్చారు. వెంటనే ఉస్సేన్ అలీని తాండూరులోని జిల్లా ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించగా అప్పటికే అలీ మృతి చెందినట్లు నిర్ధారించారు. తన తమ్ముడి మృతిపై విచారణ జరిపి న్యాయం చేయాలని సోదరుడు పోలీసులను కోరారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

ఫ్యాక్టరీ గేటు వద్ద ఆందోళన

కార్మికుడు చనిపోయిన విషయం తెలుసుకున్న మృతుని బంధువులు, కార్మికులు, గ్రామ నాయకులు ఫ్యాక్టరీ గేటు వద్దకు చేరుకొని ఆందోళన చేపట్టారు. యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు ఆందోళన విరమించబోమని స్పష్టం చేశారు. విషయం తెలుసుకున్న కరన్‌కోట్ ఎస్‌ఐ విఠల్‌రెడ్డి సిబ్బందితో ఫ్యాక్టరీ వద్దకు చేరుకొని ఆందోళనకారులతో చర్చలు జరిపారు. ఫ్యాక్టరీ యాజమాన్యంతో గ్రామ నాయకులు, కార్మిక సంఘాలు పలు దఫాలుగా చర్చలు జరిపారు. బాధిత కుటుంబానికి కంపెనీ పరంగా రావాల్సిన అన్ని సదుపాయాలు సమకూరుస్తామని యాజమాన్యం హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. పంప్‌హౌస్ కాంట్రాక్టర్ నుంచి రూ.లక్ష పరిహారం, కంపెనీ నుంచి రూ.7 లక్షల ఇన్సూరెన్స్, మృతుని భార్యకు ఉద్యోగం, ప్రతి నెలా రూ.3 వేలు, ఒక్క పిల్లాడికి రూ.500 పెన్షన్ ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు రాజ్‌కుమార్, నాయకుడు శ్రీనుగౌడ్, సీసీఐ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి శరణప్ప, మాజీ ఉప సర్పంచ్ హేమంత్, పలువురు కార్మికులు, నాయకులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

మొయినాబాద్: ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న ఓ వ్యక్తి గడ్డిమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ సంఘటన మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని వెంకటాపూర్‌లో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వెంకటాపూర్ గ్రామానికి చెందిన చిట్టెంపల్లి దాసు(35) కొంత కాలంగా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. సమస్యలు ఎక్కువ కావడంతో మనస్తాపానికి గురైన ఆయన శుక్రవారం మధ్యాహ్నం గడ్డి మందు తాగాడు. వాంతులు చేసుకుంటుండగా కుటుంబ సభ్యులు గమనించి చికిత్స కోసం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందు తూ ఆదివారం ఉదయం మృతి చెందాడు. ఈ మే రకు కేసు నమోదు, చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

గంజాయి విక్రేత అరెస్ట్

మీర్‌పేట: గంజాయి విక్రేతను సరూర్‌నగర్ ఎక్సైజ్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి కథనం ప్రకారం.. భీసెట్టి గణేశ్(25) ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం నుంచి గంజాయిని తీసుకొచ్చి నగరంలో విక్రయిస్తున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు శనివారం సదరు వ్యక్తిని బాలాపూర్ చౌరస్తాలో అదుపులోకి తీసుకున్నారు. అతడి నుంచి 3.5 కిలోల గంజాయి, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు.

చెన్నై టు జమ్మూ బైక్ యాత్ర

అమీర్‌పేట: మాదక ద్రవ్యాల వినియోగం వల్ల జరిగే అనర్థాలపై అవగాహన కల్పిస్తూ చెన్నై రోటరీ క్లబ్ ప్రతినిధి ఇళయరాజా సుందరేశన్ చేపట్టిన బైక్ యాత్ర నగరానికి చేరుకుంది. శనివారం గ్రీన్‌ల్యాండ్ వద్ద సుందరేశన్‌కు వివిధ శాఖలకు చెందిన రోటరీ క్లబ్ ప్రతినిధులు ఘనంగా స్వాగతం పలికారు. సమాజ వికాసానికి రోటరీ క్లబ్ అందిస్తున్న సేవలతో పాటు మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే నష్టాలను వివరిస్తూ సుందరేశన్ చెన్నై నుండి బయలుదేరాడు. నగరంలోని అమీర్‌పేట, గ్రీన్‌ల్యాండ్స్ నుంచి నిజామాబాద్ మీదుగా నాగ్‌పూర్..అక్కడి నుంచి వివిధ రాష్ట్రాల గుండా జమ్మూ కశ్మీర్ వరకు పయనిస్తారు. 16 రోజులుగా సాగే యాత్రలో 8 వేల కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తారని రోటరీ క్లబ్ డీజీఎన్‌డీ హరిహరప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ 3150 డిస్ట్రిక్ట్ గవర్నర్ కె.శరత్‌చౌదరి, హైదరాబాద్ నార్త్ అధ్యక్షులు బి.ఆర్.వి.సుశీల్‌కుమార్, కార్యదర్శి వెంకటమురళి తదితరులు పాల్గొన్నారు.

వేరే వ్యక్తిని పెళ్లి చేసుకుంటే చంపేస్తా

- యువతికి వేధింపులు
- యువకుడిపై కేసు నమోదు

సనత్‌నగర్: పెళ్లి చేసుకోవాలని ఓ యువతిని ఒత్తిడి చేయడమే కాకుండా..ఆమె వివాహ నిశ్చితార్థాన్ని చెడగొట్టి.. వేరెవరినైనా పెళ్లి చేసుకుంటే చంపేస్తానని బెదిరించిన యువకుడిపై బేగంపేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..నిజామాబాద్ జిల్లా బాల్కొండ ప్రాంతానికి చెందిన యువతి (21) నగరంలోని ఓ హాస్టల్‌లో ఉంటూ డిగ్రీ రెండో సంవత్సరం చదువుతుంది. కామారెడ్డిలో నివాసం ఉంటూ ప్రైవేటు ఉద్యోగం చేసే శేషుకుమార్ (28) గత తొమ్మిది నెలల క్రితం సదరు యువతిని బస్సులో కలిశాడు. నెల తర్వాత శేషు ఆమెను పెళ్లి చేసుకోమని అడిగాడు. దీనికి ఆమె నిరాకరించి స్నేహితులుగా ఉందామని చెప్పింది. ఈ క్రమంలో ఇరువురూ కలిసి ఫొటోలు దిగారు. ఇదిలా ఉండగా తన వివాహ నిశ్చితార్థం ఖరారు అయ్యిందని యువతి స్నేహితులకు చెప్పగా వారి ద్వారా శేషు ఆ విషయాన్ని తెలుసుకున్నాడు. దీంతో ఈ నెల 6న సాయంత్రం 5.30 గంటల ప్రాంతంలో బేగంపేట ఫ్లైఓవర్ వద్ద ఆమెను కలుసుకుని ఘర్షణకు దిగాడు. ఆమెపై చేయి చేసుకున్నాడు. ఆమెతో వివాహ నిశ్చితార్థం జరుపుకునే యువకుడి ఫోన్ నెంబర్ తీసుకుని వారిద్దరూ దిగిన ఫోటోలను అతనికి పంపించడంతో పాటు లేనిపోని ఆరోపణలు చేశాడు. దీంతో ఆ నిశితార్థం ఆగిపోయింది. అనంతరం తనను పెళ్లి చేసుకోవాలని యువతిపై ఒత్తిడి పెంచాడు. తనను కాదని వేరే వారిని పెళ్లి చేసుకుంటే చంపేస్తానని బెదిరింపులకు పాల్పడ్డాడు. దీంతో బాధితురాలు బేగంపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

హాస్టల్ గదిలో ఉరేసుకుని..

- బీటెక్ విద్యార్థి ఆత్మహత్య
- ఇబ్రహీంపట్నంలోని గురునానక్ ఇంజనీరింగ్ కళాశాలలో ఘటన
- విద్యార్థి సంఘాల ఆందోళన
- మృతురాలిది ఖమ్మం జిల్లా



విద్యార్థిని భావన(ఫైల్)



కళాశాల వద్ద ఆందోళన చేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నేతలు

ఇబ్రహీంపట్నం: ఓ బీటెక్ విద్యార్థి హాస్టల్ గదిలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలోని గురునానక్ కాలేజీలో శనివారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లా తల్లాడ మండలం కురనవెల్లికి చెందిన అలూరి భావన(22) ఇబ్రహీంపట్నం సమీపంలోని గురునానక్ కళాశాలలో బీటెక్ మూడో సంవత్సరం చదువుతూ ఇదే హాస్టల్‌లో ఉంటోంది. ఆమె గదిలో ఉండే మరో ఇద్దరు విద్యార్థినులు స్వగ్రామాలకు వెళ్లడంతో ప్రస్తుతం భావన ఒక్కతే ఉంది. ఏమైందో తెలియదు కానీ శనివారం తన గదిలోని ఫ్యాన్‌కు ఉరేసుకుంది. కొద్ది సేపటికి ఇది గమనించిన మిగిలిన విద్యార్థులు యాజమాన్యంతో పాటు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతురాలి తండ్రి శశిరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. భావన మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం స్వస్థలానికి తరలించే అవకాశం ఉందని తెలిసింది.

కాలేజీ వద్ద ఉద్రిక్తత

విద్యార్థిని ఆత్మహత్య విషయం తెలుసుకున్న మిత్రులు, విద్యార్థి సంఘాల ప్రతినిధులు కాలేజీ ఎదుట ఆందోళన చేపట్టారు. పలువురు ఎస్‌ఎఫ్‌ఐ నేతలు గేట్లు దూకి లోనికి వెళ్లడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఏసీపీ రాజు, సీఐ జగదీశ్‌లు ఆందోళనకారులను అదుపులోకి తీసుకున్నారు.

ఆత్మహత్యలకు అడ్డాగా..

గురునానక్ కళాశాల హాస్టల్ విద్యార్థుల ఆత్మహత్యలకు నిలయంగా మారిందని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు ప్రణయ్, కార్యదర్శి శంకర్ మండిపడ్డారు. భావన బలవన్మరణానికి పాల్పడిందనే విషయాన్ని బయటకు చెప్పకుండా, ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారని మండిపడ్డారు. కాలేజీలో గంజాయి, డ్రగ్స్ విరివిగా దొరుకుతున్నాయని ఆరోపించారు. విద్యార్థుల భవిష్యత్తుతో పాటు ప్రాణాలతో చెలగాటమాడుతున్న యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

గ్రామాలకు కార్యదర్శులే పట్టుకొమ్మలు

- పంచాయతీ రాజ్, స్త్రీశిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క
- పంచాయతీ సిబ్బంది సమస్యల పరిష్కారానికి హామీ



పంచాయతీ కార్యదర్శులు ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

అబ్దుల్లాపూర్‌మెట్: పంచాయతీ కార్యదర్శులే గ్రామాలకు పట్టు కొమ్మలని పంచాయతీరాజ్, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. రంగారెడ్డి జిల్లా పెద్దఅంబర్‌పేటలోని వీఆర్‌సీ కన్వెన్షన్ హాల్‌లో శనివారం నిర్వహించిన రాష్ట్ర పంచాయతీ కార్యదర్శుల ఆత్మీయ సమ్మేళనానికి బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యేలు మల్‌రెడ్డి రంగారెడ్డి, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెరెడ్డి, ఎమ్మెల్సీలు మహేశ్‌గౌడ్, కోదండరాంతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామాల్లో కార్యదర్శులు లేని వ్యవస్థను ఊహించలేమన్నారు. ప్రభుత్వాలు ప్రవేశపెట్టే ప్రతీ సంక్షేమ పథకాన్ని ప్రజల వద్దకు చేర్చడంలో వీరి పాత్ర కీలకమన్నారు. బీఆర్‌ఎస్ పాలనలో గ్రామాలు ఏమాత్రం అభివృద్ధికి నోచుకోలేదని తెలిపారు. పంచాయతీ అధికారులు, సిబ్బందికి సకాలంలో వేతనాలు చెల్లించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. ఈక్రమంలో మానసిక ఒత్తిడికి గురై సుమారు 50 మంది పంచాయతీ కార్యదర్శులు ప్రాణాలు కోల్పోయారని స్పష్టంచేశారు. ప్రస్తుతం రేవంత్‌రెడ్డి పాలనలో ఇలాంటి సమస్యలన్నీ దూరమై పంచాయతీ అధికారులు, సిబ్బంది ఆనందంగా ఉన్నారన్నారు. ఇంకా కొన్ని సమస్యలను తన దృష్టికి తీసుకువచ్చారని వాటిని కూడా సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. సమావేశం ప్రారంభానికి ముందు పాకిస్తాన్ ఉగ్రవాదుల చేతిలో మరణించిన అమరవీరుల ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ మౌనం పాటించి, అంజలి ఘటించారు. మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండలం లక్ష్మీపురం గ్రామ కార్యదర్శిగా పనిచేస్తూ ఆత్మహత్యకు పాల్పడిన పీర్ల వెంకన్న భార్యకు రూ.3 లక్షల చెక్కు అందజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శుల సంఘం రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు ఎ.శ్రీకాంత్‌గౌడ్, సంఘం రాష్ట్ర కమిటీ ప్రధాన కార్యదర్శి ఎస్.నాగరాజు, గౌరవ అధ్యక్షుడు ఎం.సందీప్, కోశాధికారి ఎం.శశింద్రగౌడ్ తదితరులు పాల్గొన్నారు.